# బడ్జెట్ మనిషి

తాళ్ళూరు నాగేశ్వర రావు

ప్రభుత్వ వ్యవహారాలలో, వ్యాపారంలో, జీవితంలో-ఎందులోనైనా సరే, బడ్జెట్ ప్రాముఖ్యం ఎంతైనా ఉంది. మనకు వచ్చే ఆదాయానికీ, అయ్యే వ్యయానికీ పొత్తు కుదిరినప్పుడే వ్యవహారాలు సాఫీగా జరిగిపోతూ ఉంటాయి. బడ్జెట్ మిగులుగా ఉన్నదంటే జీవితానికి భద్రత ఏర్పడినట్లె: లోటు బడ్జెట్ దీర్ఘవ్యాధిలాంటిది. ఇహ లోటు బడ్జెట్‌లో ఉన్న కుటుంబం తరతరాలవరకు కోలుకోలేదు. ఆయేటి కాయేడు చెదలు పట్టిన కొయ్యలా క్షీణిస్తూనే ఉంటుంది. మిగులు బడ్జెట్ ఉన్న కుటుంబం సకల భోగభాగ్యాలతో దినదిన ప్రవర్థమానమవుతూ ఉంటుంది. ఈ సూత్రాన్ని దేశదేశాల ప్రభుత్వాలకు కూడా సార్థకంగా అన్వయింపజేసి సత్ఫలితాలను పొందవచ్చు-సెక్రటేరియేట్‌లో ప్లానింగ్ శాఖలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తూన్న శివకామయ్య అభిప్రాయాలు అవి.

అంతేకాకుండా, అప్పుడప్పుడూ శివకామయ్య స్నేహితులతో ఇట్లా అంటూ ఉంటాడు.

"మనంచేసే ప్రతి పనికీ ప్లానింగ్ ఉండాలి. ఆ ప్లానింగ్‌ను దృష్టిలో పెట్టుకొని బడ్జెట్‌ను వేసుకోవాలి. అంత మాత్రంచేత మన కర్తవ్యం తీరిపోదు. బడ్జెట్‌ను ఫెర్‌ఫార్మన్స్‌తో పోల్చి చూసుకొని, ఫలితాల ప్రభావాన్ని సమీక్ష చేసుకోవాలి. నెలకు పాకెట్ ఖర్చుల కింద యాభైరూపాయలు కేటాయించినప్పుడు, నూటయాభై రూపాయలు ఖర్చు అయితే - బడ్జెట్‌వల్ల ప్రయోజనం శూన్యం. పదిరూపాయలు అటో ఇటోగా ఉండాలి. బడ్జెట్ అంచనాలకూ, అసలు వ్యయానికీ తేడా ఎందుకొస్తున్నదో, కారణాలు ఎప్పటికప్పుడు తెల్సుకొని, ఖర్చుల్ని అదుపులో పెట్టుకొంటూ ఉండాలి. ఈ విషయంలో అశ్రద్ధ చూపిస్తూ మన ప్రభుత్వమూ, ప్రభుత్వ సంస్థలూ ఘోరంగా పప్పులో కాలువేస్తున్నాయి. నేను మాత్రం తగు జాగ్రత్తగా ఉంటాను. అసలు ఎప్పుడూ నా బడ్జెట్ మిగులునే చూపెడుతుంది. ఆ మిగులులో కూడా ఇంకా మిగులే మిగులుతుంది."

శివకామయ్య ప్రవర్తననూ, ఆశయాలను చూసి ఆఫీసులోనూ, బయటాకూడా చాలమంది నవ్వుకుంటూ ఉంటారు. 'బడ్జెట్ మనిషి' అంటూ ఎగతాళి చేస్తూ ఉంటారు. అయినా ఆయన పట్టించుకోడు. ఆయన పాతికేళ్ళ క్రితం సెక్రటేరియేట్‌లో ఎల్. డి. సి. గా చేరాడు. అప్పర్ డివిజన్ క్లర్కు అయిన పది యేళ్ళలో సెక్షన్ ఆఫీసరుగా ప్రమోషన్ వచ్చింది. ఎన్నో డిపార్టుమెంట్లు మారాడు; ఎంతోమంది ఆఫీసర్ల దగ్గర పనిచేశాడు. అందరి దగ్గరా 'మంచివాడు' 'వొళ్లు వంచి పనిచేస్తాడు' 'ముక్కుకు సూటిగా పోయే మనిషి' 'పైసా లంచం తీసుకొన్న పాపం ఎరుగని వాడు' మొదలైన పొగడ్తల పత్రాలను పొందినవాడు. గత పదిహేను ఏళ్ళుగా ప్లానింగ్ శాఖలో పనిచేస్తున్నాడు. అప్పట్నుంచీ శివకామయ్య బడ్జెట్ మనిషిగా మారిపోయాడు. బడ్జెట్ సూత్రాలనూ, ప్రక్రియలనూ నిత్యజీవితానికి అనువర్తింపజేసుకొని—ఆర్థిక, మానసిక పరమైన తృప్తి పొందసాగాడు.

బడ్జెట్ అవసరాన్ని, ప్రాధాన్యాన్ని శివకామయ్య గుర్తించడానికి పదిహేనేళ్ల క్రితం ఒక చిన్న సంఘటన జరిగింది. ఫస్టుతారీఖున మామూలుగా జీతంపుచ్చుకొన్నాడు. ఇంటి అద్దె, కిరాణాకొట్లో బాకీ, చిల్లరమల్లర పద్దులూ చెల్లించాడు. ఎవరో ఒక మిత్రుడు ప్రాణంమీదికి వచ్చిందంటే, పాతిక రూపాయలు చేబదులు ఇచ్చాడు. హఠాత్తుగా బంధువులొచ్చి వారంరోజులు తిష్ఠవేశారు. వాళ్ల సినిమాలు చూడటానికీ, సరదాలకూ, షికార్లకూ ఇంట్లో ఉన్న సొమ్మేకాకుండా బ్యాంకులో ఉన్న కొద్ది బ్యాలెన్సుకూడా కరిగిపోయింది. తర్వాత రెండు రోజు

లకు పెద్దబ్బాయికి పెద్ద జబ్బుచేసింది. ఇంజక్షన్లు కొనడానికి, డాక్టరుకు ఫీజు ఇవ్వడానికీ డబ్బులేకపోయింది. ఇద్దరు మిత్రుల్ని చేబదులు అడిగి, లేదనిపించుకొని, చెంప ఛెళ్లుమన్నంత అవమానాన్ని పొందాడు. మనిషి తల్లకిందు లైనాడు. తనను తాను విపరీతంగా తిట్టుకున్నాడు. ఆదాయానికీ, ఖర్చుకూ నిర్దిష్టమైన కార్యక్రమం లేకపోవడంవల్లనేగదా—ఇన్ని ఇబ్బందులకు గురికావల్సి వచ్చిందని తెలుసుకున్నాడు. అప్పట్నుంచీ ప్రతి నెలా ఒక బడ్జెట్‌ను రూపొందించుకొని అందులోని అంకెల ప్రకారం ఖర్చుల మీద పూర్తి కంట్రోల్‌ను విధించాడు.

పదిహేను యేళ్లుగా బడ్జెట్ అంకెల మధ్య జీవితాన్ని బిగించి, యాంత్రికంగా బ్రతకడంవల్ల శివకామయ్య బాగానే వెనకవేశాడని చెప్పవచ్చు. అదీగాక ఆయనకు మూడెకరాల భూమి సొంత వూళ్ళో ఉంది. దానిమీద ఏటా వచ్చే ఆదాయాన్ని బ్యాంకు ఖాతాలో ప్రత్యేకంగా జమకడుతూ ఉండేవాడు. ఆ ఖాతాలో సొమ్ముతోనే మూడేళ్ళక్రితం గాంధీనగర్‌లో ఒకచిన్న డాబా కట్టాడు.

నెల మొదటి తేదీనే బడ్జెట్ తయారు చేసేవాడు శివకామయ్య. ఇన్సూరెన్సు, ప్రావిడెంట్ ఫండ్‌కూ పోగా మిగిలిన మొత్తంలో పాతిక రూపాయలు మిగిలేటట్లు బడ్జెట్ వేసుకొనేవాడు. ఆ బడ్జెట్‌లో ఇంటిఖర్చులకూ, పిల్లల చదువులకు, సినిమాలకు, బస్సు ఛార్జీలకు, ఆగంతుక ఖర్చులకు విడివిడిగా పద్దులుండేవి. ఏ పద్దులో ఏ కాస్త డబ్బు ఖర్చు కాకుండా మిగిలినా, ఒక ప్రత్యేక ఖాతా కిందికి ఆడబ్బు జమఅవుతూ ఉంటుంది. వైద్యంకింద పదిరూపాయలు కేటాయిస్తే, అదృష్టవశాత్తు ఇంట్లో ఎవ్వరికీ జబ్బుచేయకపోతే, ఆ నెలలోని పది రూపాయలు ప్రత్యేక ఖాతాలో జమ అవుతూంటాయి. అట్లాగే ఆగంతుక ఖర్చులకింద అంటే కాంటిన్జన్సీస్ కింద కేటాయించిన మొత్తంలో వ్యయంకాకపోతే, ఆ సొమ్ము ప్రత్యేక ఖాతాకు ట్రాన్సఫర్ అవుతుంది. ఆ ప్రత్యేక ఖాతా ఉద్దేశమేమిటో శివకామయ్యకు ఒక్కడికే తెలుసు. ఎవ్వరితో చెప్పనుకూడా లేదు. అవసరమైనప్పుడు చెబుతామనుకొని, రహస్యంగా ఉంచాడు.

బడ్జెట్‌లో ప్రోవిజన్‌లేని అంశాలమీద ససేమిరా ఖర్చుపెట్టేవాడు కాదు శివకామయ్య. ఒకసారి ఆయన తోడబుట్టినది చుట్టపుచూపుగా ఆరేళ్ళ తర్వాత వచ్చింది.

"ఏమండీ! మీ చెల్లెలు చాలాకాలం తర్వాత మన ఇంటికొచ్చింది. ఒక నేత చీరైనా పెట్టకపోతే బావుంటుందా?" అన్నది శివకామయ్య భార్య.

"బావుండదు" అన్నాడు శివకామయ్య ముక్తసరిగా.

ఆవిడ ప్రాణంపై చల్లగాలి వీచింది.

"అయితే బజారుకెళ్ళి ఓ వెంకటగిరి చీర పట్టుకురండి" అన్నదావిడ.

"ఈ నెలలో కుదరదు. ఆమె సడన్‌గా వచ్చింది. ఆమె ఈ నెలలో వస్తుందని తెలిస్తే, ఆమెకు చీరపెట్టాల్సి వస్తుందని అనుకుంటే-ఈ నెల బడ్జెట్‌లో ఓ పాతిక రూపాయలు కేటాయించి ఉండేవాణ్ణి. ఇప్పు డెట్లా? బడ్జెట్‌లో ప్రోవిజన్ లేదు. బడ్జెట్‌లో లేని ఐటమ్ మీద పైసాకూడా ఖర్చు పెట్టడానికి వీల్లేదు." అన్నాడు శివకామయ్య నిర్దయగా.

ఆవిడ కనురెప్పలు వాల్చకుండా విస్తుపోయింది.

అట్లాగే బడ్జెట్‌లో ప్రోవిజన్‌లేని కారణంగా శివకామయ్య దాన ధర్మాలు అసలే చేసేవాడుకాదు. లాటరీ, పేకాట, రేసెస్ మొదలైనవాటిజోలికి పోయేవాడుకాదు. ఒకసారి సెక్రటరియేట్‌లో ఒక యు.డి.సి.కి అరవై తొమ్మిదివేల ఆరు వందల యాభై ఆరు రూపాయలు జాక్‌పాట్ వచ్చింది. దానితో మిగతా ఉద్యోగస్తుల రక్తమాంసాల్లో వేడి పుట్టింది. ప్రతి డిపార్ట్‌మెంట్‌లో పదిమంది కలిసి కారీడ్ ఓవర్ జాక్‌పాట్ కోసం చందాలు వేసుకొని వందలకొద్దీ కాంబినేషన్లు కట్టసాగారు. ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌లో కూడా ఒక గ్రూపువారు శివకామయ్య దగ్గరకొచ్చారు.

"సార్, మీ వంతు అయిదు టిక్కెట్లు. అయిదు అయిదులు ఇరవై అయిదు రూపాయలు. జాక్‌పాట్ మన డిపార్టుమెంట్‌క్కు వచ్చిందంటే, మీ వంతు పాతికవేల రూపాయలుదాకా వస్తుంది. అంతా వైట్ మనీ!" అన్నాడొక యు. డి. సి.

"ఇట్లాంటివాటికి నా బడ్జెట్‌లో ప్రోవిజన్ లేదోయ్!" అన్నాడు శివకామయ్య నిర్మొహమాటంగా.

"ఛీ. వెధవ బడ్జెట్ మనిషి. బడ్జెట్ బుద్ధి" అంటూ వాళ్లు మనసుల్లో తిట్టుకొన్నారు.

శివకామయ్యకు ముగ్గురు పిల్లలు. ఇద్దరు మగపిల్లలూ, ఒక ఆడపిల్ల. అందరికంటె ఆడపిల్ల పెద్దది. పి.యు.సి. వరకు చదువుకుంది. మంచి సంబంధం వస్తే, కట్నంకానుకలు అట్టే లేకుండానే పెళ్ళిచేశాడు. అల్లుడు ఒక లిమిటెడ్ కంపెనీలో ఇంజనీరు. పెద్దబ్బాయి బి. కాం. చదివి, ఒక ఛార్టర్డ్ అకౌంటెంట్ దగ్గర ఆర్టికిల్స్ చేస్తున్నాడు. చిన్నవాడు పదోక్లాసు. పిల్లల చదువులకూ, పాకెట్ ఖర్చులకూ నెల నెలా బడ్జెట్‌లో ఇంత మొత్తమని కేటాయిస్తూ వుంటాడు శివకామయ్య. అట్లాగే భార్యకోసంకూడా. ఆ మొత్తాన్ని మించి రాగిపైసాకూడా వాళ్ళకు ఇవ్వడు. వారి కోర్కెలు, అవసరాలు, సరదాలు అన్నీ ఆ బడ్జెట్ సంఖ్యల లోపుగానే ఇముడ్చుకోవాలి.

ఆర్నెల్లక్రితం శివకామయ్య భార్య




లివర్ క్యాన్సర్‌తో కన్నుమూసింది. ఆమె రోగానికి శివకామయ్య బడ్జెట్ ప్రకారమే ఖర్చుపెట్టాడనీ, ఆ మొత్తం చాలక, సరైన వైద్యసహాయం అందక ఆమె అనుకొన్న కాలానికంటె ముందుగా ఈ లోకాన్ని విడిచివెళ్ళిందనీ కొంత మంది అనుకొన్నారు. కాని ఈ విషయం ఆయన చెవిదాకా రాలేదు. అయితే ఒకటి మాత్రం నిజం. ఆవిడ రోగానికి నిల్వ నుంచి వేయిరూపాయలు కేటాయించాడు. ఆ మొత్తంలో ఆరువందల నలభై రూపాయలే ఖర్చు అయింది. మిగతా మూడువందల అరవై రూపాయల్ని ఆవిడ అంత్యక్రియలకోసం ఖర్చు పెట్టాడు.

ఆ మరుసటి నెలనుంచీ బడ్జెట్‌లో ఆవిడకింద పద్దులేదు ఇదివరకు ఆవిడ ఖర్చుకింద కేటాయించే మొత్తాన్ని ప్రత్యేక ఖాతాకు జమకట్టసాగాడు.

అట్లా కాలం గడుస్తూ ఉంది.

శివకామయ్య రిటైర్‌అయ్యే టైము సంవత్సరంలో పడింది.

పెద్దకొడుకు సి. ఏ. ప్యాసై, ఒక పెద్ద కంపెనీలో జూనియర్ అకౌంట్స్ ఆఫీసరుగా చేరాడు.

చిన్నకొడుకు బి. యస్సీ. ఫైనల్ ఇయర్‌లో ఉన్నాడు.

ఒకరోజు సాయంత్రం శివకామయ్య ఆఫీసునుంచి రిక్షాలో ఇంటికివస్తున్నాడు. సాధారణంగా ఆయన రిక్షా ఎక్కడు. ఎప్పుడూ బస్సులోనే వస్తూ ఉండేవాడు. కాని విద్యార్థులకూ, ఒక బస్సు డ్రైవరుకూ జరిగిన సంఘర్షణలో—విద్యార్థులు ఆ బస్సు డ్రైవర్ను కొట్టడంతో, డ్రైవర్లంతా ఆ సాయంకాలం సమ్మెచేశారు. శివకామయ్యకు రిక్షా ఎక్కక తప్పలేదు. రిక్షాలు, ఆటోలు, టాక్సీలు ఎక్కడానికి ఆయన బడ్జెట్‌లో ఆస్కారం లేదు. ఇట్లాంటి తప్పనిసరి పరిస్థితులు వచ్చినప్పుడు ఆగంతుక నిధినుంచి చెల్లింపు చేయవచ్చు.

ఆఫీసు వదిలిన టైంకావడంతో రోడ్డంతా హడావుడిగా ఉంది. కార్లు, రిక్షాలు, ఆటోలు,సైకిళ్లు, లారీలు—కోలాహలంగాఉంది. అశోక్‌నగర్ మలుపు తిరగబోయేముందు, పల్లంగా ఉన్న రోడ్డులో రిక్షా వేగంగా వస్తున్నది. అంతలో వెనగ్గా ఒక ఆటోవచ్చి రిక్షాను ఢీకొన్నది. రిక్షాలోఉన్న శివకామయ్య ఎగిరి రోడ్డుమీద పడ్డాడు. నలభై కిలో మీటర్ల వేగంలో, పెనుభూతంలా వస్తున్న బెంజిలారీ శివకామయ్య మీదుగా పోయింది. శివకామయ్య నెత్తురుముద్ద అయిపోయాడు. వెంటనే టాక్సీలో జనరల్ హాస్పటల్‌కు వేసుకెళ్ళారు.

ఆ దారుణవార్త తెలియరాగా, గంట తర్వాత శివకామయ్య కొడుకులిద్దరూ హాస్పటల్‌కు పరుగెత్తారు. అప్పటికే శివకామయ్య కొనఊపిరితో కొట్టుమిట్టుకు లాడుతున్నాడు. కాని ఇంకా మాట సాంతం పడిపోలేదు. బ్రతికే ఆశ లేదని డాక్టర్లు ఏకవాక్యతగా చెప్పారు.

"బాబూ!...నా బతుకు అయిపోయింది. భగవంతుడు...ఇంతత్వరగా పిలుస్తాడనుకోలేదు ... మీకు ఎన్నో పాఠాలు ... నేర్పుదామనుకున్నాను ... నెల నెలాబడ్జెట్ వేసుకొని, ఆ ప్రకారం ...ఆదాయాన్నీ, ఖర్చుల్నీ సరిపెట్టుకొంటే, జీవితంలో...ఆర్థికమైన ఒడుదుడుకులు ఉండవు. ఇదే నా పిల్లలకు నే నిచ్చే...ఆఖరి సలహా!...నా అంత్యక్రియలకోసం బ్యాంకులో ప్రత్యేకం ఒక ఖాతా తెరిచిఉంచాను...అందులో చాలా మొత్తం జమకూడి ఉంది. ఆ మొత్తాన్ని నా అంత్యక్రియలకు ఖర్చుపెట్టండి." ఆ తర్వాత కొద్దినిముషాలకే శివకామయ్య కన్నుమూశాడు.

కొడుకు లిద్దరూ శివకామయ్య అంత్యక్రియలను ఘనంగానే చేశారు. కాని అంత చేసినప్పటికీ, ప్రత్యేక బ్యాంకు ఖాతాలో ఆ పద్దుకింద ఏర్పరచిన మొత్తంలో—ఇంకా రెండువేల మూడు వందల ఇరవైతొమ్మిది రూపాయలు మిగిలిపోయింది!

*